# టెలిఫోను కథ

"అయితే, నువ్వు ఊరికి రాదలచుకో లేదన్నమాట"

"నా వల్ల కాదు. తీరుబడి లేదు."

"పోనీ స్టేషన్‌కేనా వస్తావా, దిగబెట్టడానికి?"

"దానికేం భాగ్యం. అలాగే"

ఊరికి రమ్మని బ్రతిమాలిన అమ్మాయి పేరు మేబెల్.

ఆమెను ప్రేమించి పెళ్లిచేసుకోదలచిన యువకుడు, అన్నమాట ప్రకారం, సాగనంపడానికి స్టేషన్‌కి వెళ్ళాడు. రైల్లో కూర్చుని ముచ్చటలాడుతున్న మేబెల్, రైలు కదలగానే ఒక్కసారిగా ఏడవడం మొదలుపెట్టింది. ఆ అబ్బాయి ఆశ్చర్యపడ్డాడు. కంగారు పడ్డాడు. సంగతి బోధపడక, చటుక్కున రైలెక్కిపోయాడు.

జి. ఎన్. రాధాకృష్ణ

"టిక్కెట్టు కూడా లేకుండా రైలెక్కిపోయాను నీ కంట నీరు చూసి. ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాడు

మేబెల్ పక్కున నవ్వింది. "ఫిలడెల్ఫియా రావయ్యా వచ్చి, నీ టెలిఫోన్ సంగతి నువ్వే స్వయంగా చెప్పి ప్రదర్శించవయ్యా అని మర్యాదగా చెబితే విన్నావూ?" అంది.

జరిగిన మోసం గ్రహించగానే అతనికి కోపం వచ్చేసింది. వచ్చికూడా చేసేదేం లేదు.

"బడి పనివల్ల తీరుబడి లేదని శతవిధాల చెబితే నువ్వు చేసిందిదా.. హు. మొత్తానికి నీ పంతం నెగ్గించుకున్నావు" అని విసుక్కున్నాడు గ్రహాం బెల్.

గ్రహాం బెల్ అని ఒక ఆసామీ ఒక మూల ఉన్నాడనీ, ఆయన టెలిఫోన్ అనే ఒక యంత్రం కనిపెట్టాడనీ, ఫిలడెల్ఫియాలోని ఎగ్జిబిషన్‌లో ఒక మారుమూల ఆ యంత్రం ఉన్నదనీ తొలిసారిగా నలుగురికీ తెలియడానికి రెండుమూడు రోజుల ముందుగా, బెల్‌కి మేబెల్ ఈ టోకరా ఇచ్చింది.

గ్రహాంబెల్ ఒక యంత్రం కనిపెట్టాడు. దాని ద్వారా దూరదూరంగా ఉన్న ఇద్దరు మనుష్యులు మంచీ చెడ్డా మాట్లాడుకోవచ్చును. ఈ యంత్రం సంగతి ఎవరూ వినలేదు. విన్నా, 1876లో జనం, దీన్ని నీలివార్త అనేసి ఊరుకునే వారు.

1876 లో ఫిలడెల్ఫియాలో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటయింది. అక్కడ రకరకాల



టెలిఫోను కనిపెట్టిన అమెరికన్ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ గ్రాహాంబెల్. (ఆయన మనుమరాళ్లతో)



అబ్బా! ఒకే జలుబు...భారము...



అమృతాంజనం వాడితే...



తగ్గిపోయింది!

అమృతాంజనము





# ★ టెలిఫోన్ కథ ★

కొత్త యంత్రాలు ప్రదర్శిస్తున్నారు. శాస్త్రజ్ఞులు, పెద్దలూ వాటిని పరిశీలించి నిగ్గు తేల్చేవారు. వారు గొప్పదని ఎన్నిక చేస్తే, అది లోకం దృష్టిలోకి వస్తుంది. దాని మీద పరిశోధనలు సాగించడానికీ, అభివృద్ధి చెయ్యడానికీ దోహదం లభిస్తుంది...

గ్రహాంబెల్ యంత్రాన్ని చూసిన హాబర్డ్ అనే పెద్దమనిషి, దాన్ని ఫిలడెల్ఫియా ఎగ్జిబిషన్‌లో పెట్టమని ప్రోత్సహించాడు. ఆయన ఎగ్జిబిషన్ విద్యాశాఖను చూస్తున్నాడు. సరేనని బెల్ దాన్ని పంపించాడు. ఎగ్జిబిషన్‌లో బెల్ యంత్రానికి ఒక మూలచోటు ఇచ్చారు.

ఇది చూసి, బెల్ స్వయంగా అక్కడికి వెళ్ళి తన యంత్రం గురించి పరీక్షాబృందానికి తెలియజెప్పి, దానిచేత పనిచేయించి చూపించడం అవసరమని హాబర్డ్ చెప్పాడు.

ఆయన బెల్‌కు కాబోయే మామగారు. "నువ్వు వచ్చితీరాలబ్బాయ్!" అని శత విధాల నచ్చచెప్పాడు.

బెల్ అప్పుడు బాస్టన్‌లో చెవిటి మూగ పిల్లల బడిలో పనిచేస్తున్నాడు. ఆబడిలో పరీక్షలు జరుగుతున్నాయి. అందుకని ససేమిరా బడివదిలి వచ్చేదిలేదన్నాడు.

హాబర్డ్‌కి ఆశపోక, తనకూతురు మేబెల్‌ని చెప్పిచూడమన్నాడు.

మేబెల్ చెప్పినాకూడా బెల్ ఒప్పుకోలేదు.

"పరీక్షల మధ్యలో వెళ్ళిపోయి పిల్లలికి అన్యాయం చెయ్యమంటావా" అన్నాడు.

"సరే నేను వెళ్తున్నాను. స్టేషనుకయినా రా" అంది మేబెల్.

రైలు కదులుతూఉండగా ఒక్కసారిగా మేబెల్ ఏడవడంతో, బెల్‌కి బెంబేలెత్తిపోయి రైలెక్కిపోయాడు.

చేసేదిలేక విసుక్కుంటూ ఫిలడెల్ఫియా వెళ్ళాడు.

1876 జూన్ నెలలో ఒక ఆదివారంనాడు కొత్తయంత్రాల పరీక్షకు ముహూర్తం పెట్టారు. గ్రహాంబెల్ చక్కగా ముస్తాబై ఎగ్జిబిషనుకు వెళ్ళాడు. అక్కడ విద్యుచ్ఛక్తితో పనిచేసే కొత్తయంత్రాలు చాలా ఉన్నాయి. బ్రాజిల్ చక్రవర్తి డాంపెడ్రో, ఆనాటి ప్రముఖ విద్యుచ్ఛక్తి శాస్త్రజ్ఞుడు సర్ విలియం థాంప్సన్, లార్డ్ కెల్విన్ ప్రభృతులు పరీక్షకులు.

ఆబృందం ఒకదాని తరువాత ఒకటి చూడసాగారు. తన యంత్రం చూడాలన్న ఆదుర్దా బెల్ మనసులో ఎక్కువైనకొద్దీ పరీక్షకులలో ఓర్పు తగ్గసాగింది. 'ఇవాళకింక చాలు పోదాం' అన్న విసుగుదల గోచరించసాగింది.

ఎలిషాగ్రే అనే ఆయన ఒక యంత్రం తయారుచేశాడు. అది సంగీత స్వరాలను ప్రసారం చేయగలదు. దాన్ని గురించి ఆయన ఎడతెరిపి లేకుండా అదేపనిగా చెప్పుకుపోతున్నాడు. బాగానేఉంది కాని, ఎంతకీ తెమలదేం అనిపించింది. కొంతసేపటికి అది తెమిలింది.

తన యంత్రంచూస్తారనుకున్నాడు బెల్. 'ఇవాళ కింకచాలు' అనేశారు పరీక్షక బృందం అధ్యక్షుడు.

బెల్ ప్రాణంఉసూరుమనిపించింది. ఇవాళ చూడకపోతే ఇంకెప్పుడూ చూడరన్నమాటే. పైగా తనువెంటనే బోస్టన్ వెళిపోవాలి.

ఉద్వేగపూరితమైన ఈ సన్నివేశం గురించి బెల్ స్వయంగా ఇలా వ్రాసుకున్నాడు.

"పరీక్షకులంతా వెళ్ళిపోసాగారు. నాయంత్రం చూడనట్టేఅని గుండె దిగజారిపోయింది నాకు. అంతలో బ్రాజిల్ చక్రవర్తి పెడ్రో నన్ను చూచి పలకరించారు. బాస్టన్ బడిలో ఆయననన్ను అదివరకు చూశారు.

'మీ బళ్ళో పిల్లలు కులాసాగా ఉన్నారా?" అని చక్రవర్తి అన్నారు.

"ఆహా సుఖంగా ఉన్నారండి... మరండి... నేను కనిపెట్టిన యంత్రం ఇక్కడే ఉంది...పక్కదే"అన్నాను నేను హడావుడిగా.

అలాగా అంటూ ఆయన నాచెయ్యి పుచ్చుకుని నాతో బయల్దేరారు. చక్రవర్తే నాతో రావడంతో, మిగతా వారంతా గొర్రెలమందల్లే మావెంట వచ్చేశారు."

సరే అంతా రాగానే బెల్, చక్రవర్తిని ఒక బల్లదగ్గర కూర్చోమన్నాడు. టెలిఫోన్ శ్రవణయంత్రం ఆయన చెవిదగ్గర పెట్టుకోమన్నాడు. అదేమిటో ఏంచేస్తుందో ఎవరికీ తెలీదు.

బెల్ పక్కగదిలోకి వెళ్లాడు. టెలిఫోన్ యంత్రంలో అతి స్పష్టంగా, ఎంతో నెమ్మదిగా మాట్లాడాడు.

చక్రవర్తి కొంచెంసేపు విని కనుబొమలు పైకెత్తాడు. ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"ఇది మాట్లాడుతోంది"అన్నాడు ఒక్కసారిగా అందర్నీ కలియచూస్తూ.

తరవాత విద్యుచ్ఛక్తి శాస్త్రజ్ఞుడు సర్ విలియం థాంప్సన్ దాన్ని చెవిదగ్గర పెట్టుకున్నాడు.

ఆ యంత్రం గొట్టంలో మానవకంఠం విని

అని, ఒక్కసారిగా, లేచి, "ఇది నిజంగా మాట్లాడుతోంది ఇంత అద్భుతమైన దాన్ని నే నెక్కడా చూడలేదు... కొన్నాళ్లుపోతే మిత్రులు, విద్యుచ్ఛక్తి తీగమీదుగా రహస్యాలు మాట్లాడుకోవచ్చును" అన్నాడు.

"ఆ క్రితం రోజు రాత్రి నేను ఒక అనామకుడిని. తెల్లవారేసరికి, యశస్విని. చాలా పెద్దవాడిని. గొప్పవాడిని... దీనికి కారణం సర్ విలియం థాంప్సన్. ఆయనకిది తెలియడానికి కారణం చక్రవర్తి డాం పెడ్రో. ఆయన నన్ను గుర్తించి ఇంత చెయ్యడానికి మూలకారణం బాస్టన్ బడిలోని మూగ, చెవిటిపిల్లలు" అని టెలిఫోన్ కనిపెట్టిన గ్రహాంబెల్ వ్రాసుకున్నాడు.

టెలిఫోన్ అన్నది గ్రీకు పదం. దూరం నించి వినబడే స్వరం అని అర్థం.

ప్రయోగాత్మకంగా కాకుండా వాడుకకు వీలైన టెలిఫోన్ కనిపెట్టినవాడుగా గ్రహాంబెల్ పేరు అధికార రీత్యా గుర్తించబడింది. 1874 ఫిబ్రవరి 14 న తొలిసారిగా. 1877 లో మలిసారిగా టెలిఫోన్ పేటెంటు ఆయన కిచ్చారు. అంతకు చాలకాలం క్రితమే-1837 లో చార్లెస్ జి. పేజ్ అనే ఆయన విద్యుచ్ఛక్తి ద్వారా శబ్దాన్ని పంపవచ్చునని కనుగొన్నాడు. కాని ఇదమిత్థంగా దాన్ని నిరూపిస్తూ ఉపయుక్తమైన దేదీ చేయలేదు. అలాగే 1861 లో ఫిలిప్ రీస్ అనే జర్మన్ శాస్త్రజ్ఞుడు సంగీత స్వరాలు ప్రసారంచేసే యంత్రం ఒకటి తయారు చేశాడుగాని, ఉపయుక్తమైన దేదీ చెయ్యలేదు. ఇంకా ఆ నేకమంది టెలిఫోన్ కనుగొన్నామన్న పేరు తమ దన్నారు. ఎలీషా గ్రే అనే ఆయన పేటెంటు ఆఫీసుకు నోటీసు ఇచ్చారు. అదే రోజున అక్కడ బెల్, తొలిసారి పేటెంట్ తీసుకున్నాడు.

అమెరికాలో 850 లక్షల టెలిఫోన్లు ఉన్నాయి. సగటున ప్రతి నలుగురికీ ఒక్కొక్కటన్నమాట. స్వీడన్లో ప్రతి ఐదుగురికీ, కెనడాలో ప్రతి ఆరుగురికీ ఒక్కొక్క టెలిఫోన్ చొప్పున ఉన్నాయి. మన దేశంలో ......సగటున 1800 మందికి ఒక టెలిఫోన్ ఉంది! ఐదువందల మందికి ఒకటి లభ్యం చేయడం రెండవ ప్రణాళిక లక్ష్యం. 1948 మే నెలలో బెంగుళూరులో 'ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్' పేరిట, ఒక టెలిఫోన్ కర్మాగారం నెలకొల్పారు. ఈ కేంద్రం దిన దిన ప్రవర్ధమానమై, నేటికి ఉత్పత్తి పరిమాణంలోనూ, సరుకు నాణ్యతలోనూ చురుకుగా ముందడుగు వేస్తోంది. నిర్ణీత లక్ష్యాలు కూడా అధిగమిస్తోంది. ఆసియాలో కొన్ని దేశాలవారు ఈ ఫ్యాక్టరీనుండి పరికరాలు కొనుక్కోవాలని ఆకాంక్షిస్తూ ఉండడం మనకి గర్వకారణం.

టెలిఫోన్ అతి చురుకుగా వ్యాపించింది. దాని 'మాతృదేశం' అమెరికా. ఈనాడు అమెరికాలో 850 లక్షల టెలిఫోన్లు - ప్రపంచంలో ఉన్న టెలిఫోన్లలో దాదాపు సగం, ఉన్నాయి. దాదాపుగా, ఇవన్నీ 'బెల్ టెలిఫోన్ సిస్టం' క్రిందనే పనిచేస్తాయి. ప్రపంచం మొత్తంమీద టెలిఫోన్లలో నూరింట 96 వరకూ కూడా ఈ 'సిస్టం' క్రిందనే పనిచేస్తాయి.

## టెలిఫోన్ ఎలా పనిచేస్తుంది?

నిశ్చలంగా ఉన్న చెరువులో చిన్నరాయి పడవేస్తే చక్రాలు చక్రాలుగా తరంగాలు బయలుదేరి అంతకంతకు పెద్దవవుతూ తరలిపోతాయి. మనం మాట్లాడే మాటకూడా అంతే. టెలిఫోన్లో మాట్లాడితే ఈ శబ్ద తరంగాలు విద్యుత్తరంగాలుగా మారుతాయి.

మనం మాట్లాడే గొట్టంలో ఒక పల్చటి గుండ్రటి రేకుబిళ్ల ఉంటుంది. ఇది విద్యుత్ప్రవాహంలో ఒక భాగంగా అమరిఉంటుందన్నమాట. మనం అనే మాటలవల్ల బయలుదేరే శబ్దతరంగాలనుబట్టి ఈ రేకు రెపరెపలాడినట్లుగా ముందుకు వెనక్కు ఆడుతుంది. ఇది ముందుకువచ్చినపుడు విద్యుత్ప్రవాహం కొంచెం బలహీనంఅవుతుంది. వెనక్కు వెళ్లినప్పుడు బలంగా ప్రవహిస్తుంది. దీనివల్ల మన శబ్దతరంగాలు విద్యుత్తరంగాలుగా మారిపోయి తీగలో ప్రవేశిస్తున్నాయన్నమాట. ఈ తరంగాలు మహావేగంగా, తీగ అవతలచివరకి, అదెంతదూరమైనాసరే వెళ్లిపోతాయి. అక్కడ, విద్యుచ్ఛక్తి ప్రవహించినపుడుమాత్రం ఆకర్షణశక్తిని సంపాదించే ఇనుపకడ్డీల జోడీఉంటుంది. దాన్ని ఎలక్ట్రోమాగ్నెట్ అంటారు. వాటిని ఇంచుమించు అంటిపెట్టుకున్నట్టుగా మరో పల్చటి గుండ్రటిరేకు ఉంటుంది. విద్యుత్తరంగాలు ఎలక్ట్రోమాగ్నెట్లోకి వెళ్లగానే, ఆ తరంగాల బలాబలాల ప్రకారం ఆ మాగ్నెట్, దానిఎదటఉన్న రేకుని ఆకర్షిస్తూఉంటుంది. మాట్లాడినచోట బయలుదేరిన శబ్దతరంగాలు, అక్కడిరేకు రెపరెపలాడడంవల్ల విద్యుత్తరంగాలుగా మారాయి కాబట్టి, ఈ వినేచోట ఉన్న రేకు సరిగ్గా అదేక్రమంలో అదేప్రకారం ఆడుతుంది. అందువల్ల అక్కడ ఉచ్చరించిన శబ్దమే ఇక్కడ తిరిగి బయలుదేరుతుంది. అంటే ఇంచుమించు ఇదంతా తద్దనాతతంగం అన్నమాట. ★





రాజా
హేర్ ఫిక్సర్
స్ఫురద్రూప మిచ్చును




GP3

ఉచిత బహుమానం!



నం. 501 తలనూనె వుపయోగించువారి జుట్టు విరివిగా పొడుగుగా అందముగా తుమ్మెదవలె యుండును.

ఒకసీసా రు-2-8-0; 3సీసాలు రు. 6-8-0 ఒక్కొక్క బాటిలు కొనువారికి 15 సం॥ గ్యారంటితో పనిచేయు రిష్టువాచి, ఒక కొత్త బంగారు వుంగరం బహుమానం యివ్వబడును. 3 సీసాలు ఒక్కసారికొన్నవారికి నాల్గు రిష్టువాచీలు, 4 వుంగరములు బహుమానం.

ఏది వచ్చకున్నా ధర వాపస్

జోహార్ మాసన్ నెం. 666-వెంట్రుకలను తీసివేసి చర్మమును మృదువు చేయును. 1 సీసా రు. 2-9; 3 సీసాలు 6-8-0, బహుమతులు పైవలెనే.

Saniyasi Ayurvedic Pharmacy,
(A.P.M.) P. B. 1397, Delhi.